రాజ్యాధికారం వైపు పయనించాలి

ఒంగోలు టౌన్: బహుజనులు రాజ్యాధికారం వైపు పయనించాలని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు సతీష్ చందర్ పిలుపునిచ్చారు. బ్లూవింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్లయ్య లింగం భవన్‌లో జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బహుజనుల్లో నాయకత్వ లక్షణాలు ఎలా ఉండాలో వివరిస్తూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అంబేడ్కర్ కాలం నుంచి కాన్షీరాం హయాం వరకు సాధించిన రాజకీయ ఫలితాలపై విశ్లేషణ చేశారు. ఎస్సీ, ఎస్టీ మైనారిటీలు రాజకీయంగా సంఘటితం కావాలని సూచించారు. సామాజిక , రాజకీయ, ఆర్థిక , సాంస్కృతిక రంగాల్లో అంబేడ్కర్, కాన్షీరాం బాటలో బలమైన రాజకీయ శక్తిగా ఎదగాలని బ్లూవింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పులి మల్లికార్జునరావు అన్నారు. ఫౌండేషన్ చీఫ్ అడ్వైజర్ శివరామకృష్ణ తమ సంస్థ లక్ష్యాలను వివరించారు.

ప్రకృతిని కాపాడటం అందరి బాధ్యత



మురసం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి



జీజీహెచ్‌లో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి సూపరెంటెండెంట్ బాలాజీ నాయక్, ఆర్‌ఎంఓ తిరుమలరావు

ఒంగోలు టౌన్: ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డి అన్నారు. శనివారం మాగుంట కార్యాలయంలో ముస్లిం రచయితల సంఘం ప్రచురించిన కేలండర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కారణమేదైనా మనమంతా ప్రకృతిని విధ్వంసం చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వినియోగం వలన వాతావరణంలో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. రసాయనిక ఎరువులను పూర్తిగా తగ్గించుకోవలసిన తరుణం ఆసన్నమైందన్నారు. ఇంధన వినియోగానికి ప్రత్యామ్నాయంగా విద్యుత్ వాహనాలు వచ్చాయని, ప్రజలు బాధ్యతగా ప్రకృతిని కాపాడుకునేందుకు నడుము కట్టాలని పిలుపునిచ్చారు. ముస్లిం రచయితల సంఘం అధ్యక్షుడు షేక్ మహబూబ్ జాన్, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు, బెల్లం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ క్యాలెండర్ ఆవిష్కరణ

సీఐటీయూ అనుబంధ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ ప్రచురించిన నూతన సంవత్సర కాలెండర్‌ను జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ బాలాజీ నాయక్, ఆర్ఎంఓ డాక్టర్ తిరుమల రావు, మెడికల్ ఆఫీసర్ జె.విజశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్ఎంఓ మాట్లాడుతూ.. మెడికల్ సిబ్బంది మరింత నిబద్ధతతో విధులు నిర్వహించాలని కోరారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు జి.నాగేశ్వరరావు, కె.శ్రీధర్ బాబు, బి.ధనాంజనేయులు, పి.శిరిష, సి.శారద, కె.రత్నకుమారి, కె.కాజరాణి, ఏ.శివశంకర్ పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీతో భరోసా



ఆరోగ్య శ్రీ కార్డు అందిస్తున్న ధాకా సుజాత హనుమారెడ్డి

ఒంగోలు సబర్బన్: ఆరోగ్య శ్రీ ద్వారా పేదలకు పూర్తిస్థాయి భరోసా కల్పించినట్లు 36వ డివిజన్ కార్పొరేటర్ ధాకా సుజాత హనుమా రెడ్డి చెప్పారు. ఈ మేరకు స్థానిక 36వ డివిజన్‌లోని నిర్మల్ నగర్ వార్డు సచివాలయంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ఆరోగ్య శ్రీ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుజాత హనుమారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదల పక్షపాతిగా పాలన సాగిస్తున్నారన్నారు. పేదల ఆరోగ్యం బాగుంటే కుటుంబం సంతోషంగా ఉంటుందని వెల్లడించారు. ప్రతి ఇంటిలో ఆరోగ్యం కోసం, చదువు కోసం మాత్రమే అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. అలాంటిది రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈ రెండు అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి ప్రభుత్వమే భరించేవిధంగా చర్యలు చేపట్టారని కొనియాడారు. సచివాలయం పరిధిలో 373 నూతన ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేశారు.

మండల ఓటర్లు 42,340



తహసీల్దార్ బీవీ రమణారావు

కొత్తపట్నం: మండలంలో 14 పంచాయతీల్లో 42,340 మంది ఓటర్లు ఉన్నట్లు తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం విలేకర్లతో మాట్లాడుతూ పురుషులు 20,826 ఉండగా మహిళలు 21,514 ఉన్నట్లు తెలిపారు. పురుషులు కంటే మహిళలే ఎక్కువగా ఉన్నారని వివరించారు. అత్యధిక ఓట్లు కొత్తపట్నం 6,602, ఈతముక్కల 6,300, మడనూరు 5,616, అల్లూరు 5,043, కె.పల్లెపాలెం 3,717, రాజుపాలెం 3,062, మోటుమాల 2,632, గవళ్ళపాలెం 2,529, గుండమాల 1,698, రంగాయపాలెం 1,390, ఆలూరు 1,323, పాదర్తి 1,198, గాదెపాలెం 681, సంకువారిగుంట 549 ఓట్ల మేర జాబితా ఉన్నట్లు తెలిపారు. ఎన్నికలు జరిగే మధ్య కాలంలో కొత్త ఓట్లు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. మరణించ వారివి తీసివేస్తామన్నారు. ఇప్పటికే 40 వేల ఓట్లకు ఆధార్ అనుసంధానం జరిగిందని మిగతా వాటిని కూడా ఆధార్‌కు అనుసంధానం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండలంలో 53 బూత్‌లు ఉన్నాయని బీఎల్వోలు లిస్టులో ఉన్న పేర్లు, ఇంటి పేర్లు, అడ్రెసులు ఇప్పటికే తొంభై శాతం పూర్తి చేశామన్నారు. అన్ని బూత్‌లను కూడా పరిశీలించి వసతుల లేని వాటిని గుర్తించామన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో లోపం ఉండకూడదు



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులు సమ్మె బాట పట్టటంతో సంక్రాంతి పండగకు ఎక్కడా పారిశుద్ధ్య పనుల విషయంలో లోపం ఉండకూడదని సిబ్బందిని, అధికారులను ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. శనివారం నగరంలో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. వీఐపీ రోడ్డు, పాత గుంటూరు రోడ్డు, హౌసింగ్ బోర్డుతో పాటు పలు ప్రాంతాల్లో పర్యటించి పర్మినెంట్ పారిశుద్ధ్య కార్మికులకు, అదనపు కార్మికులకు, సిబ్బందికి, అధికారులకు ప్రత్యేకంగా సూచనలు చేశారు. అందుకోసం ఒంగోలు నగర పాలక సంస్థ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అందులో భాగంగా నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పనుల పర్యవేక్షణకు డివిజన్ల వారీగా ప్రత్యేకంగా అధికారులను కేటాయించారు.

గ్రానైట్ వర్కర్స్‌కు దుస్తుల పంపిణీ



గ్రానైట్ వర్కర్స్‌కు దుస్తులను పంపిణీ చేస్తున్న మారం వెంకారెడ్డి

చీమకుర్తి: సంక్రాంతి పండగ సందర్భంగా అద్దంకి వైఎస్సార్ సీపీ పరిశీలకులు మారం వెంకారెడ్డి గ్రానైట్ వర్కర్స్‌కు దుస్తులను పంపిణీ చేశారు. శనివారం చీమకుర్తిలోని తన నివాసంలో వెంకారెడ్డికి చెందిన క్వారీ, గ్రానైట్ ఫ్యాక్టరీ, తన ఆఫీస్ సిబ్బందితో కలిపి మొత్తం 300 మందికి నూతన వస్త్రాలను అందజేశారు. అనంతరం సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలిపారు. మేడగం బ్రహ్మారెడ్డి, మేడగం వెంకటేశ్వరరెడ్డి, వల్లంరెడ్డి అంజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మాలలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి



మాట్లాడుతున్న బిళ్లా చెన్నయ్య

ఒంగోలు: మాలలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిళ్లా చెన్నయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు నిర్ణయించేది మాలలేనన్నారు. అలాంటి తమ పట్ల ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తే సహించేదిలేదన్నారు. టికెట్ల కేటాయింపులో తగిన రాజకీయ ప్రాధాన్యతను అన్ని రాజకీయ పార్టీలు కల్పించాలని కోరారు. నామినేటెడ్ పోస్టుల లోను అధిక ప్రాధాన్యత కేటాయించాలన్నారు. ఇటీవల ప్రభుత్వం రీసర్వే చేసిన ప్రాంతాల్లో మిగులు భూమిని ఎస్సీ, ఎస్టీలకు డీకే పట్టాల ద్వారా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఒంగోలు నగరంలో అంబేడ్కర్ ఆడిటోరియం నిర్మాణానికి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం రూ.7 కోట్లు కేటాయిస్తే గత టీడీపీ ప్రభుత్వం వాటిని పక్కదారి పట్టించిందని విమర్శించారు. మక్కెన థామస్, బత్తుల వెంకట్రావు, లింగంగుంట కార్తీక్, బాబూరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



వైఎస్సార్ బీమాను అందిస్తున్న పార్టీ నాయకులు

చీమకుర్తి: స్థానిక 16వ వార్డులో షేక్ మాలిన్‌బీ అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ సీపీ నాయకులు మేకల యల్లయ్య, గోపురపు చంద్ర చేతుల మీదుగా వైఎస్సార్ బీమాను శనివారం అందించారు. మట్టి ఖర్చుల కోసం రూ.10 వేలను అందించినట్లు తెలిపారు. జేసీఎస్ కన్వీనర్ మంచా హరికృష్ణ, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా యనమల



యనమల వెంకటేశ్వర్లు

ఒంగోలు: ఏపీ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ టెన్యూర్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా యనమల వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. శుక్రవారం రాత్రి గుంటూరు జిల్లాలో జరిగిన రాష్ట్ర నూతన కార్యవర్గ ఎంపిక కార్యక్రమంలో యనమల వెంకటేశ్వర్లుకు ఈ హోదా లభించింది. యనమల వెంకటేశ్వర్లు ప్రస్తుతం ఒంగోలులోని పోక్సో కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

భవనం నుంచి జారిపడి విద్యార్థి మృతి

దర్శి: ఆడుకుంటున్న బాలుడు నాలుగు అంతస్తుల భవనం నుంచి జారిపడి మృతి చెందిన సంఘటన హైదరాబాదులోని నాగోల్‌లో శనివారం చోటుచేసుకుంది. బండివెలిగండ్ల గ్రామానికి చెందిన కొంకాల వెంకటేశ్వర్లు కుమారుడు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. బండివెలిగండ్లకు చెందిన కొంకాల వెంకటేశ్వర్లు, మల్లేశ్వరి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడన్నారు. వీరు బతుకు దెరువు కోసం బెల్దారీ పనులు చేసేందుకు హైదరాబాదు వలస వెళ్లారు. వీరి కుమారుడు శివ (14) శనివారం మధ్యాహ్నం సమయంలో గాలిపటం ఎగరవేయటానికి నాలుగు అంతస్తుల భవనం ఎక్కి ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కార్యక్రమంలో 2003 టెన్త్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

చీమకుర్తి: సంతనూతలపాడు జిల్లాపరిషత్ హైస్కూలులో 2003 సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థుల పూర్వ సమ్మేళనం శనివారం జరిగింది. ఆ నాటి హెచ్ఎం, ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. వారి వద్ద విద్యనభ్యసించిన నాటి గుర్తులను, మధుర స్మృతులను తలచుకొని ఒకరికొకరు అభిమానాన్ని చాటుకున్నారు. ఉపాధ్యాయులను సత్కరించారు. పూర్వ చక్రవర్తి, అంకారావు, వాసు తదితరులు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో తిరుమంజన సేవ



పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, టీటీడీ బోర్డు సభ్యుడు శిద్దా సుధీర్ దంపతులు

చీమకుర్తి: అగ్రహారంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన తిరుమంజనసేవలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, టీటీడీ బోర్డు మెంబర్ శిద్దా సుధీర్ దంపతులు పాల్గొన్నారు. ధనుర్మాస తిరుప్పావై వ్రత మహోత్సవం సందర్భంగా స్వామివారికి, అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా స్వామివారికి, అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందించారు. శిద్దా కుటుంబ సభ్యులు, సోదరులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు



పోటీల విజేతలతో నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: స్థానిక గద్దలగుంట గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రామాలయం వద్ద ముగ్గుల పోటీలను శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన ముగ్గుల పోటీలో అత్యధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. డి. సుబ్బులక్ష్మి జి.సాయి లక్ష్మి ఎస్ .రమ్యశ్రీ ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులు గెలుపొందారు. న్యాయ నిర్ణేతగా ప్రముఖ మహిళా న్యాయవాది లక్ష్మీకుమారి వ్యవహరించారు. శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, గద్దలగుంట గ్రామ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఆరిగ శ్రీనివాస్ ఈదుపల్లి అంకబాబు, ఈదుపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీడీవో, తహసీల్దార్

నాగులుప్పలపాడు: క్రీడలతో శారీరక మానసిక ఉల్లాసం సాధ్యమని ఎస్సై హరిబాబు అన్నారు. ఉప్పుగుండూరులో మాదాసు కృష్ణమూర్తి మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ పోటీలను మండల తహసీల్దార్ సుజన్‌కుమార్, ఎంపీడీవో జయమణి , ఎస్సై హరిబాబు చేతుల మీదగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై హరిబాబు మాట్లాడుతూ గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తితో ఆడి గెలవాలని క్రీడాకారులను కోరారు. ముందుగా మాజీ సర్పంచ్ కామ్రేడ్ మాదాసు కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. నిర్వాహకులు మాదాసు రాంబాబు, గ్రామ సర్పంచ్ దేవరకొండ జయమ్మ, మున్నంగి వెంకట్రావు, కొంజేటి సురేష్, పెంట్యాల శ్రీను, వజ్రం బాబు, ప్రవీణ్ పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు సరుకులు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

ఒంగోలు అర్బన్: సూర్యశ్రీ దివ్యాంగుల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐఎంఎస్ అమర్ రెడ్డి ఆర్థిక సహకారంతో వంద మంది పేదలకు లక్ష రూపాయల విలువ చేసే బియ్యం, నిత్యావసరాలను శనివారం ట్రస్టు సభ్యులు పంపిణీ చేశారు. పేదలు పండగ చేసుకుని సంతోషంగా ఉండాలని ట్రస్టు ఆధ్వర్యంలో సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. దీనిలో ట్రస్టు వ్యవస్థాపకుడు మండవ మురళీకృష్ణ, డాక్టర్ చాపల వంశీకృష్ణ, ట్రస్టు సెక్రటరీ సర్దార్‌బాషా ఇతర సభ్యులు మారెళ్ల సుబ్బారావు, మండవ సుబ్బారావు, కోచూరి శ్రీదేవి, షేక్ మహబూబ్, బొడ్డపాటి వెంకట్, రాయపాటి రవికిరణ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



ఉలిచిలో దుప్పట్ల పంపిణీ చేస్తున్న జనసేవా సమితి నాయకులు

ఒంగోలు రూరల్: మాదిగ జనసేవా సమితి ఆధ్వర్యంలో ఉలిచి గ్రామంలో పేదలైన వృద్ధులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. శనివారం ఉదయం 11 గంటలకు జరిగిన ఈ కార్యక్రమంలో మాదిగ జనసేవా సమితి కో-ఆర్డినేటర్ గద్దల వెంకటేశ్వర్లు కార్యదర్శి అమ్మయ్య మాస్టర్, రంగభూమి కళాసమితి నాయకులు అంగళకుర్తి ప్రసాద్, అట్లూరి రాఘవులు పాల్గొన్నారు. వక్తలు సమితి లక్ష్యాలను వివరించారు. తరతరాలుగా ఎస్సీ, ఎస్టీ అణచివేతకు గురైన ఎస్సీ, ఎస్టీలు బాబాసాహెబ్ అంబేడ్కర్ సూచించిన పే బ్యాక్ టూ సొసైటీ ఇవ్వాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన ఉద్యోగులు నిరుద్యోగులను, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు రమా సుందరి మాట్లాడారు.